క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



పెడన: చేవేంద్ర పీహెచ్‌సీ పరిధిలోని లంకలకలువగుంట గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎఫ్‌పీసీ (ఫ్యామిలి ఫిజిషియన్ క్యాంపు) కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించినట్లు చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని పరిశీలించి వారికి మందులను అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంపీహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

నేడు లోక్ కల్యాణ్ మేళ

పెడన: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం లోక్ కల్యాణ్ మేళ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో వీధి వ్యాపారుల రుణాల కోసం కొత్త దరఖాస్తుల స్వీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిశీలను వంటి విషయాలపై వివరించనున్నారని అన్నారు. పట్టణంలోని మెప్మా పరిధిలో నమోదైన వ్యాపారులు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లు పంపిణీ



చల్లపల్లి: స్థానిక పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలోని పాల ఉత్పత్తిదారులకు గురువారం బోనస్‌లు పంపిణీ చేశారు. 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకూ వచ్చిన సంఘం లాభాలలో 70 శాతం రూ.1,54,933లను 210 మంది సభ్యులకు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మీ తెలిపారు. అత్యధికంగా పాలు పోసిన మొదటి ముగ్గురు పాల రైతులకు బహుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక బల్క్ మిల్క్ సెంటర్(బీఎంసీ) ఏఎంపీవో తమ్మన సురేష్ కుమార్, వేతన కార్యదర్శి గొరిపర్తి మురళీ కృష్ణ, పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

దారపు శ్రీనివాసరావు మరణం తీరనిలోటు



దారపు శ్రీనివాసరావు

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తూర్పు కృష్ణా జిల్లా కార్యదర్శి, గుడ్లవల్లేరు ఎంపీడీవోగా ఎనలేని సేవలు అందించి పదవీ విరమణ చేసిన దారపు శ్రీనివాసరావు(63) మరణం తమకు తీరనిలోటని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉల్లి కృష్ణ ఒక ప్రకటనలో అన్నారు. శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరులో అనారోగ్య కారణాలతో మరణించారని.. ఆయన మృతదేహాన్ని శుక్రవారం ఉదయం 7 గంటలకు మచిలీపట్నం పరాసుపేటలోని ఆయన స్వగృహానికి తీసుకురానున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. సంతాపం తెలిపిన వారిలో సంఘ నాయకులు ఆకూరి శ్రీనివాస్, ఆత్మూరి వెంకటేశ్వరరావు, ఆర్.హేమప్రకాష్, ఎ.జాషువా, జయకర్, సీహెచ్ లక్ష్మీశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పెడన: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు ఉచితంగా వేస్తున్నామని.. దీనిని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ పెడన ఏడీ కొనకళ్ల బాబురావు అన్నారు. ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని కవిపురం గ్రామంలో పర్యటించి పశువులకు ఉచిత టీకాలను వేశారు. అక్టోబరు 15వ తేదీ వరకు ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఏడీ సూచించారు.

విభాగాల పరిశీలనలో కమిషనర్

మచిలీపట్నం టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు గురువారం పరిశీలించారు. కార్యాలయంలోని రెవెన్యూ, అకౌంట్స్, ఎస్టాబ్లిష్మెంట్, ఖజానా తదితర విభాగాలను ఆయన పరిశీలించి పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ పై ఆరా తీశారు. పెండింగ్ ఫైళ్లను వెలికి తీసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



అడ్డపర్రలో కాత్యాయనీ దేవిగా అమ్మవారు



పెడన బ్రహ్మపురం చౌడేశ్వరి దేవి ఆలయంలో..



అన్నపూర్ణాదేవిగా పెదకళ్లేపల్లి దుర్గామాత



కాత్యాయనీగా కొత్తపాలెం దుర్గాదేవి



నడకుదురు పృథ్వీశ్వరస్వామి ఆలయంలో..

లోకపావని.. కాత్యాయనీ

దసరా శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో కొలువైన దుర్గమ్మ గురువారం శ్రీ కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. లోకనాయకిని చూడటానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పొంగళ్లు, పులిహోరను జగన్మాతకు నైవేద్యంగా సమర్పించి తల్లిముందు ప్రణమిల్లారు.

- నాలుగో రోజూ అమ్మకు విశేష పూజలు
- ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- జగన్మాత నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు

కోడూరు: నవరాత్రుల్లో నాలుగో రోజు గురువారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులు దర్శనమిచ్చారు. 'లోకపావని.. కాత్యాయనీ దేవి' అంటూ భక్తులు పూజలు చేశారు. కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలను భక్తిప్రపత్తులతో జరిపారు. ఆలయ ప్రాంగణంలో గుడివాడకు చెందిన పొదర్తి సిస్టర్స్ శిష్య బృందంతో జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ అమ్మవార్లను కాత్యాయనీదేవిగా అలంకరించారు.

కృత్తివెన్ను: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నీలిపూడి, అడ్డపర్ర ఆలయాల్లో కాత్యాయనీ దేవిగా.. కృత్తివెన్ను శివాలయంలో శ్రీమాతా అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు.



కాత్యాయనీ దేవిగా కోడూరు గంగాభవానీ అమ్మవారు

పెడన: పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ ఆధ్వర్యంలో స్థానికులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. బ్రహ్మపురంలోని శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెడన శ్రీ పైడమ్మ అమ్మవారిని శ్రీ ఇష్టకామేశ్వరి దేవిగా అలంకరించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీ కాత్యాయనీ దేవిగా అలంకరించారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో కొలువైన శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో నాలుగో రోజు గురువారం దుర్గాదేవి శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొక్కిలిగడ్డలో శ్రీ గంగా భ్రమరాంబ అమ్మవారు, మోపిదేవి శ్రీ సకలేశ్వరస్వామివారి దేవస్థానం, కె.కొత్తపాలెం, దుర్గా కోటేశ్వరస్వామి వారి ఆలయంలో దుర్గామాత కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు.

నాగాయలంక: స్థానిక శ్రీ పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం కాత్యాయనీ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో కొల్లూరు శివశంకర్ దంపతులు శ్రీ చక్ర సహిత కలశ పీఠం, హోమం కార్యక్రమంలో పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామపాద క్షేత్రంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని శ్రీకాత్యాయనీ మాతగా అలంకరించి విశేష పూజలు జరిపారు. గణపేశ్వరంలో మండలంలో చారిత్రిక ప్రసిద్ధి గల శ్రీ దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దుర్గమ్మను అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

కాత్యాయనీగా బాలాత్రిపుర సుందరీ..

చల్లపల్లి: ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న మండల పరిధిలోని శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గురువారం కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గణపతి శావాచార్యులు అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ పర్యవేక్షకులు మల్లుపెద్ది త్రివిక్రమరాలు, తదితరులు పర్యవేక్షించారు.

పూజలందుకున్న కాత్యాయనీ దేవి..

మచిలీపట్నం టౌన్: ఆజాద్ రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి శ్రీ ధాన్యలక్ష్మీ దేవిగా, శ్రీ పార్వతీదేవి శ్రీ కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన స్వరలహరి కార్యక్రమంలో ఆలపించిన భక్తి గీతాలాపనలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్ పర్యవేక్షించారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు శ్రీ మీనాక్షీదేవిగా, ఈడేపల్లిలోని శక్తిగుడిలో అమ్మవారు కాళికాదేవిగా, రాజుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత రాజమౌళేశ్వర స్వామి ముచ్చంగుడిలో అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు.

గూడూరు: తరకటూరులోని శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు పరాశక్తి రూపంలో దర్శనమిచ్చారు. గూడూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగన్మాతకు పూజలు చేశారు.

అవనిగడ్డ: స్థానిక రాజశేఖరస్వామి ఆలయం, లంకమ్మ అమ్మవారి ఆలయం, పులిగడ్డ, వేకనూరు కనకదుర్గ ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు.

బంటుమిల్లిలో

బంటుమిల్లి: స్థానిక ఆలయాల్లో కొలువైన అమ్మవార్లను శ్రీ కాత్యాయనీ దేవిగా.. పెదతుమ్మిడి శివాలయంలో అమ్మవారిని శ్రీ వైష్ణవీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీసంతానలక్ష్మీదేవిగా, శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ విజయలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌లో దసరా పండుగ సందర్భంగా వార్షికంగా నిర్వహించే దేవీ, ఆయుధ పూజలను సిబ్బంది కుటుంబ సభ్యులతో పాల్గొని ఘనంగా నిర్వహించారు.



బంటుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ, దేవీ పూజలు

అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు..

చల్లపల్లి: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసర నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చల్లపల్లికి చెందిన నాట్య గురువు దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు ఆధ్వర్యంలో 22 మంది చిన్నారులు వివిధ రూపకాలు ప్రదర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, తమ్మన సతీష్, మెహెర్ తదితరులు నాట్య గురువు నరసింహారావును ఘనంగా సన్మానించారు.



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

సంక్షిప్తం

• స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

గూడూరు: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ డి.కె. బాలాజీ అన్నారు. 'పండిట్ దీన్‌దయాల్ జయంతి'ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఏక్ దిన్ ఏక్ ఘంట ఏక్ సాత్' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల రోడ్డులో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను పరిశీలించారు.

• డీఎస్సీ ఉద్యోగులకు ఎమ్మెల్యేల అభినందనలు

కొడాలి(ఘంటసాల): మెగా డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన ఘంటసాల మండలం కొడాలి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన తలకటూరి స్వరూప రాణి, పెనుమూడి కోటేశ్వరరావులను అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజాలు అభినందించారు. అమరావతిలో గురువారం జరిగిన అపాయింట్‌మెంట్ లెటర్ల జారీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

• భావితరాలకు స్వచ్ఛ వాతావరణం

చిలకలపూడి(మచిలీపట్నం): భావితరాల వారికి స్వచ్ఛ వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి' సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం డీఆర్వో ఉద్యోగులతో స్వచ్ఛోత్సవ్ ప్రతిజ్ఞ చేయించి కలెక్టరేట్‌లోని పలు ప్రాంతాల్లో పిచ్చి మొక్కను తొలగించి పరిశుభ్రం చేయించారు.

• వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

పాపవినాశనం(ఘంటసాల): మహిళల ఆరోగ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు అన్నారు. పాపవినాశనం గ్రామంలో సచివాలయం పరిధిలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ కుంపటి అనిత, ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ గురువారం ప్రారంభించారు. శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) మాట్లాడుతూ.. వైద్యులు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాపవినాశనం(ఘంటసాల): వరద పెరుగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ అన్నారు. ఘంటసాల మండలం పాపవినాశనం వద్ద కృష్ణానదిని గురువారం ఆయన పరిశీలించారు. నదిలోకి ఎవరూ వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు.

• ఆన్‌లైన్ భవన ప్లాన్ల దరఖాస్తులపై అవగాహన

మచిలీపట్నం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న ఆన్‌లైన్లో భవన నిర్మాణాల ప్లాన్ల దరఖాస్తు నమోదు ప్రక్రియపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాఫ్ట్ టెక్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధి శివకుమారి నగరంలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు.

• శ్మశానవాటిక మంజూరుపై వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): పెడన మండలం నందిగామ గ్రామంలో ఎస్టీలకు శ్మశానవాటికను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ యానాదుల ఎడ్యుకేషన్, పారిశుద్ధ్య కార్మికుల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎం.ఫణిదూర్జటి, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, ఎస్టీ సంఘ నాయకులు మౌలాలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గుచేటు

చల్లపల్లి: గతంలో ఆడవాళ్ల గురించి పత్రికల్లో రాయలేని విధంగా మాట్లాడిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పార్టీ ఆర్‌టీఐ వింగ్ జిల్లా అధ్యక్షులు పొనమాల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా జగన్‌మోహనరెడ్డిని నిందించిన బాలకృష్ణ వ్యాఖ్యలను కనీసం స్పీకర్ కూడా ఖండించకపోవటం బాధాకరమన్నారు.

• ఘనంగా ధార్మిక ప్రవచనాలు

గూడూరు: తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తరకటూరుపాలెంలోని శ్రీ కోదండరామాలయంలో ధార్మిక ప్రవచనాలను ఘనంగా నిర్వహించారు. ధర్మప్రచార పరిషత్ ప్రతినిధి తురగా ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ప్రవచనాలు గురువారం ప్రారంభమయ్యాయి.

• పాఠశాలలో స్వస్తి నారీ.. స్వశక్తి పరివార్

వెంకటాపురం(మోపిదేవి): మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని డాక్టర్ అర్షియా సుల్తానా తెలిపారు. మండలంలోని వెంకటాపురం జెడ్పీ పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన స్వస్తి నారీ...స్వశక్తి పరివార్ వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకర్, కె.విజయవల్లీ, హెల్త్ అసిస్టెంట్ పి.రాంబాబు, లక్ష్మీనారాయణ, నాగలక్ష్మీ, ఏఎంఎంలు శైలజ, కరుణ, సునీత, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.రాజేశ్వరి, కె.కల్యాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

• పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెడన: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మచిలీపట్నం డీఎల్‌డీవో జి.పద్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు 'ఏక్‌దిన్ ఏక్ గంట ఏక్ శాత్ శ్రమదాన్' కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.అరుణకుమారి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.

• సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చల్లపల్లి: మండల పరిధిలో వక్కలగడ్డ నుంచి లంకతోటకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డులో రూ.8 లక్షలు, గ్రామంలోని మరో రోడ్డుకు రూ.12 లక్షలు మొత్తం రూ.20 లక్షలు జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, గ్రామ సర్పంచ్ వల్లూరు ఉమలు తెలిపారు. గురువారం రోడ్డు పనులు ప్రారంభించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు రాజులపాటి శివ ప్రసాద్, కాంట్రాక్టర్ గొరిపర్తి రమేష్, మైనార్టీ సెల్ నాయకులు పఠాన్ కరీముల్లాఖాన్, మండల సచివాలయాల కన్వీనర్ యడ్ల జగదీష్, రాజులపాటి బద్రి తదితరులు పాల్గొన్నారు.

• చికిత్స పొందిన వారు జాగ్రత్తలు పాటించాలి

తాడేపల్లి(ఘంటసాల): ఉచిత కంటి పొర శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు డాక్టర్లు చెప్పిన జాగ్రత్తలు పాటించాలని శంకర నేత్రాల ప్రతినిధులు తెలిపారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలోని మలయాళ స్వామి పెద్దాశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి పొర చికిత్స శిబిరంలో గురువారం వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సూరపనేని వెంకట్రావు, పొట్లూరి అజయ్ కుమార్, హనుమానుల కుమార్, గొర్రెపాటి పద్మజ, ఆశ్రమ ప్రతినిధులు కావూరి కోదండ రామయ్య, మొవ్వ శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

• ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వలేదు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కోర్టులో కాంట్రాక్టు విధానంలో పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ అంటూ వస్తున్న ప్రకటన అవాస్తవమని జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖాధికారి ఎం.వెంకటేశ్వర ప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 22వ తేదీన పొరపాటున తాము పత్రిక ప్రకటనను గ్రూపులో పంపామని.. అయితే ఈ నోటిఫికేషన్‌పై జిల్లా కోర్టులో ఎటువంటి ఉద్యోగాలు లేవని.. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

• సంస్కృతీ, సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయం

చిట్టూర్పు(ఘంటసాల): సంస్కృతీ, సంప్రదాయాలను ప్రోత్సహించేలా తాళం భజన పోటీలు నిర్వహించడం అభినందనీయమని చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో జిల్లాల స్థాయిలో ఉత్సాహంగా సాగుతున్న తాళం భజనటం పోటీలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్న ప్రసాద్‌ను అభినందించారు.

• మొక్కలతో పర్యావరణ సమతుల్యం

కృత్తివెన్ను: వాతావరణ పరిస్థితులను కాలుష్య కోరల నుంచి కాపాడుకోవాలంటే మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందని ఓఎన్‌జీసీ, అవేర్ ప్రతినిధులు అన్నారు. స్వచ్ఛతా మహోత్సవ్‌లో భాగంగా గురువారం వారు యండపల్లి గ్రామ పంచాయతీలో కొబ్బరి, మామిడి మొక్కలను సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్‌కు అందజేశారు. పంచాయతీ పరిధిలో సంస్థ ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ మొక్కలను నాటారు. ఓఎన్‌జీసీ ఎస్‌ఈ చరణ్‌తేజ్, హైదరాబాద్‌కు చెందిన అవేర్ సంస్థ ప్రతినిధులు కేఎస్‌వీఎస్ఎస్ పవన్, పి.దినేష్, కె.కృష్ణపడాల్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

• మహిళల భద్రత.. సామాజిక బాధ్యత

బంటుమిల్లి: మహిళల సమస్యలు సామాజిక సమస్యలుగా ప్రతి ఒక్కరూ గ్రహించి వారికి రక్షణ కల్పించాలని ఎస్‌ఐ గణేష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం మహిళల భద్రత.. సమాజిక బాధ్యత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు, వైస్ ప్రిన్స్‌పాల్ బీడీ జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరమ్మకు కౌన్సిల్ నివాళులు

వాయిదా పడిన కౌన్సిల్

మచిలీపట్నం టౌన్: నగరపాలక సంస్థ పాలకవర్గ సాధారణ సమావేశం గురువారం స్థానిక క్యాటిల్ డిపో వద్ద గల కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జూలై 21వ తేదీన మృతి చెందిన మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మకు కౌన్సిల్ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. దాదాపు 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న రాజేశ్వరమ్మ, ఆమె భర్త మోహన్‌రావులు ప్రజాసేవ చేశారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ లంక సూరిబాబు, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, జోగి చిరంజీవి, షేక్ షాహేనా, టీడీపీ సభ్యుడు ఆనంద్ తదితరులు రాజేశ్వరమ్మ ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మకు నివాళి అర్పించే ఈ సమావేశానికి టీడీపీ, జనసేన సభ్యులు హాజరు కాకపోవడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ మేయర్ మోక వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ భారతి, మాజీ డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత తదితర కార్పొరేటర్లు పాల్గొన్నారు. రాజేశ్వరమ్మకు నివాళులు అర్పించిన అనంతరం కౌన్సిల్ సమావేశాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మ వాయిదా వేశారు.



రాజేశ్వరమ్మ మృతికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

ఘంటసాల: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జీఎస్టీ మండల ప్రత్యేకాధికారి సర్దార్ పాషా అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, పీడీఎస్ డీటీ కొడాలి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గూడూరు: తగ్గించిన జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి, గూడూరు మండల ప్రత్యేక అధికారి కె.మోహన్ బాబు అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ 2.0 రిఫామ్స్‌పై మండల పరిధిలోని వివిధ సచివాలయాల మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఏఎస్‌వో మస్తాన్‌బి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జీఎస్టీ ప్రత్యేకాధికారి సర్దార్ పాషా

చల్లపల్లి: జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు కలుగుతుందని కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ మన్నెం స్వరూపరాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎం ఆనందకుమారి, పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శిలు, డీలర్లు పాల్గొన్నారు.